www.prajasakti.com
సోమవారం 22 డిసెంబర్ 2025
5
వైఎస్ఆర్

వెలుగు చూపిన వేమన పద్యాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యార్థుల విజ్ఞానానికి, ఉన్నత జీవన విధానానికి వేమన పద్యాలు ఔషధంలా పనిచేస్తాయని, మానవుని జ్ఞానమనే వెలుగు వైపు ప్రయాణింపజేస్తాయని కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. ఈనెల 7న రెడ్డి సేవా సమితి నిర్వహించిన వేమన పద్య పఠన పోటీల్లో ఎన్నికైన 32 మంది విద్యార్థులకు ఆదివారం కడప రెడ్డి సేవా సమితి ప్రాంగణంలో తుది పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ మనిషి నిత్య జీవితంలో ఆచరించాల్సిన ఉత్తమ జీవన విధానాన్ని వేమన తన పద్యాల్లో పొందుపరిచారని పేర్కొన్నారు. ఈ పద్య పఠన పోటీల వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. వాళ్ల ఆ పద్యాల్లో ఉన్న మర్మాన్ని చేజిక్కించుకుని జీవితం లో తప్పకుండా ఆచరించగలరనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ. 10000, 8000, 6000 ఇస్తున్నామని, 2000 చొప్పున 5 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు.

గ్రామీణ రహదారులకు మరమ్మతులు

-50 గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యత
- రూ.55.85 కోట్లతో పనులు

జిల్లాలోని గ్రామీణ రహదారుల మరమ్మతులకు కసరత్తు ఊపందుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే గుంతలు పడిన రహదారుల నిర్మాణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. గ్రామీణ రహదారుల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. సాస్కీ పథకం అమల్లో భాగంగా జిల్లాలోని పూర్తిగా, పాక్షికంగా, మధ్యస్థ కేటగిరీలుగా దెబ్బతిన్న రోడ్లను ఎంపిక చేశారు. మొదటి విడత కింద పూర్తిగా దెబ్బతిన్న రహదారులను ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లాలో కడప అసెంబ్లీ మినహా మిగిలిన ఆరు అసెంబ్లీ వారీగా ఆయా మండలాల పరిధిలోని దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేపడుతోంది. బద్వేల్, మైదుకూరు అసెంబ్లీలకు 10 రహదారులు చొప్పన ప్రాధాన్యత ఇచ్చారు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో గ్రామీణ రహదారులు నూతనశోభను సంతరించుకోనున్నాయి. రాష్ట్రంలోని కూటమి సర్కారు కడప అసెంబ్లీ మినహా బద్వేల్, మైదుకూరు, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల అసెంబ్లీ పరిధిలోని పూర్తిగా దెబ్బతిన్న రహదారి పనులకు ప్రాధాన్యత ఇచ్చింది. మొదటి విడతలో పూర్తిగా దెబ్బతిన్న 50 గ్రామీణ రహదారులను ఎంపిక చేసింది. రూ.55.85 కోట్లతో 128 కిలోమీటర్ల మేరకు 50 గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టడానికి జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

బద్వేల్ అసెంబ్లీ పరిధిలోని పోరుమామిళ్ల-దమ్మనపల్లి, కలసపాడు-చెన్నుపల్లి, గోపవరం మండలంలోని కెఎన్‌రోడ్డు-లక్కవారిపల్లి, బెడుసుపల్లి-దిన్నెమీదపల్లి రహదారులు, బద్వేల్‌లోని సిపిరోడ్డు-చింతలచెరువు, సిపిరోడ్డు-భాకరాపేట, సిపిరోడ్డు-కొంగలవీడు, బి.కోడూరు మండలంలోని సిపిరోడ్డు పెద్దులవారిపల్లి, అట్లూరు మండలంలోని కెఎం.రోడ్డు-వలసపాలెం రూ.9.79 కోట్లతో 28 కి.మీటర్ల మేర రహదారులకు మరమ్మతులు చేపట్టనుంది. కమలాపురం అసెంబ్లీ పరిధిలోని వల్లూరు మండలంలోని అంబవరం-దిగువపల్లి, సిపిరోడ్-వెంకటేశాపురం, ఆదినిమ్మాయపల్లి-ఇసుకపల్లి, సిటిరోడ్డు-బోరెడ్డిపల్లి, పెండ్లిమర్రి మండలంలోని సిపిరోడ్-సంగటిపల్లి, కమలాపురం మండలం కోగటం-ఎర్రగుంట్ల, అప్రోచ్‌రోడ్-కంచనగారిపల్లి, చింతకొమ్మదిన్నె మండలంలోని సిపిరోడ్-బిల్లుపల్లి రహదారులను రూ.10.31 కోట్లతో 23 కి.మీటర్ల మేర రహదారులు చేపడుతోంది. జమ్మలమడుగు అసెంబ్లీ పరిధిలోని ఎర్రగుంట్ల సిపిరోడ్-చిన్నదండ్లూరు, సుంకేశల-కోడూరు, పి.వెంకటాపురం- పోట్లదుర్తి-నిడుజువ్వి, మైలవరం ఎన్‌బిబిరోడ్డు-తొర్రివేముల, చిన్నవెంతుర్ల-పెద్ద వెంతుర్ల, ముద్దనూరు-చెన్నారెడ్డిపల్లి, కొండాపురం మండలం అప్రోచ్ రోడ్-యనమలచింతల, దేవగుడి-ఉలవలపల్లి, రూ.9.14 కోట్లతో 20 కి.మీ మేర ఎనిమిది రహదారులను నిర్మించనుంది. ప్రొద్దు టూరు అసెంబ్లీ పరిధిలోని రాజుపాలెం మండలం పర్లపాడు-చిన్నశెట్టిపల్లి వయా రామచంద్రాపురం, ప్రొద్దుటూరు మండలం వెంగలా యపల్లి-అయ్యవారిపల్లి, కల్లూరు-అయ్యవారిపల్లి, నంగనూరిపల్లి-రాగుపల్లి వరకు రూ.8.65 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనుంది. పులివెందుల అసెంబ్లీ పరిధిలో వేంపల్లి మండలం ఇడు పులపాయ-ఆర్‌కెవ్యాలీ, వెలమవారి పల్లి-గిడ్డంగివారిపల్లి, తొండూరు మండలంజెకెరోడ్-టి.తుమ్మలపల్లి, సింహాద్రిపురం మండలం తుమ్మలవారిపల్లి-కాంబల్లి, లింగాల మండలంలోని కోమన్నూతల- పార్నపల్లి, చిన్నకూడాల-రామానుతలప, చక్రాయపేట మం డలం గాలివీడు-కొండుగారిపల్లి, గండికొవ్వూరు-యర్లవాండ్లపల్లి, ఆర్‌విరోడ్-గండికొవ్వూరు రహదారులను రూ.8.75 కోట్లతో 20 కి.మీ పొడవు మేర రహదారి నిర్మాణాలను చేపట్టనుంది. మైదుకూరు అసెంబ్లీ పరిధిలో సికెరోడ్-అన్నలూరు వయా శివపురం, ఎంసిరోడ్-సుగాలితాండ, ఖాజీపేట మండలం పుల్లూరుకొట్టాల-మల్లాయపల్లి, సంజీవనగర్-ములపాక, సికెరోడ్డు- నందిపాడు, సికెరోడ్-సుంకేశల, సికెరోడ్-అంకాలమ్మ దేవాలయం, దువ్వూరు మండలంలోని మనేరాంపల్లి-పెద్దసింగనపల్లి, చాపాడు మండలం శ్రీరాములపేట-ఓబులరెడ్డిపేట, ప్రొద్దుటూరు బుక్కరాయపల్లి చిన్నవరదాయపల్లి రహదారులకు రూ.9.21 కోట్లతో 19 కి.మీ మేర రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ యంత్రాంగం ఎంపిక చేసిన 50 రహదారి నిర్మాణ పనులు చేపట్టడానికి అవసరమైన టెండర్ల నిర్వహణ అనంతరం గుత్తేదారులతో అగ్రిమెంట్లను కుదుర్చుకునే పనుల్లో నిమగ్నమైనట్లు కనిపిస్తోంది.

కడప, రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులుగా
భూపేష్, 'సుగవాసి'

ప్రధాన కార్యదర్శులుగా వైఎస్ జబీవుల్లా, పఠాన్‌ఖాదర్‌ఖాన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

భూపేష్‌రెడ్డి

సుగవాసి ప్రసాద్‌బాబు

ఎట్టకేలకు టిడిపి కడప, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుల నియామక వ్యవహారం కొలిక్కి వచ్చింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదివారం కడప పార్లమెంట్ అధ్యక్షునిగా చదిపిరాళ్ల భూపేష్‌సుబ్బరామిరెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా వైఎస్ జబీవుల్లాను నియమించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పార్ల మెంట్ అధ్యక్షునిగా సుగవాసి ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ ఖాదర్‌ఖాన్‌లను నియమించారు. 2026 సంవత్సరంలో రాష్ట్రంలోమున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, జడ్‌పిటిసిలు, పంచాయతీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో టిడిపి సంస్థాగత పార్టీ పదవుల భర్తీని చేపట్టింది. ఇందులోభాగంగా పంచాయతీ, మండల, నియోజకవర్గ కార్యవర్గాలను నియమించింది. అనంతరం పార్లమెంట్ల వారీ అధ్యక్ష నియామకాలకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా కడప, అన్నమయ్య జిల్లాల పార్లమెంట్ అధ్యక్ష నియామక అంశంపై దృష్టి సారించింది. ఈమేరకు త్రిసభ్య కమిటీతో అన్వేషణ చేపట్టింది. దీంతోపాటు ఐవిఆర్ఎస్ సర్వే ఆధా రంగా అధ్యక్ష అభ్యర్థుల నియామ కాలకు సంబంధించిన సీనియర్ కార్యకర్తల అభిప్రాయాలను సైతం క్రోడీకరించింది. కడప పార్లమెం ట్ అధ్యక్ష ఎన్నికల బరిలో పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ పార్లమెం ట్ అధ్యక్షులైన ఆర్.శ్రీనివాసులరెడ్డి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడ ప పార్లమెంట్ బరిలో నిలిచిన జమ్మలమడుగుకు చెందిన చదిపిరా ళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్ష స్థానా నికి సుగవాసి ప్రసాద్‌బాబు, విశ్వనాథనాయుడు, ముస్తాక్‌హుసేన్, మద నపల్లి ప్రాంతానికి చెందిన ఓ నాయకుని మధ్య వేర్వేరు త్రిసభ్య కమి టీలు అన్వేషించడం తెలిసిందే. అనంతరం ఐవిఆర్ఎస్ సర్వేల ద్వా రా అధ్యక్ష అభ్యర్థులను అన్వేషించింది. ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహిం చిన రెండు నెలల అనంతరం పార్లమెంట్ అధ్యక్ష అభ్యర్థుల పేర్లను ప్రకటించడం గమనార్హం.

సంక్షోభంలో సర్కార్ విద్య

- ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం
- యుటిఎఫ్ 45వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజా

సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకవర్గాలు సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డిసిఎల్ కల్యాణమండపంలో నిర్వహించిన యుటిఎఫ్ 45వ జిల్లా కౌన్సిల్ సమావేశాలకు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. అంతకుముందు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి డిసిఎల్ కల్యాణ మండపం వరకు ఉపాధ్యాయులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, యుటిఎఫ్ పతాకాన్ని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ ఆవిష్కరించారు. అనంతరం నిధుల ప్రతినిధుల సభను ఉద్దేశించి లక్ష్మీరాజ మాట్లాడుతూ సంస్కరణల అమలు పేరుతో పాలకవర్గాలు ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతలనుండి క్రమేపి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అందులో భాగంగానే పాఠశాలల్లో నిరంతరం ఉపాధ్యాయుని బోధనా సమయాన్ని హరిస్తూ, బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్నారని పాలకవర్గాలు విద్యారంగాన్ని ప్రయోగశాలగా మార్చి వింతైన వినూత్న పద్ధతులలో నిరంతరం ఉపాధ్యాయులను వేధిస్తున్నారని ఆరోపించారు. పాలకుల విధానాల ఫలితంగా పేదవాడికి విద్య అందని ద్రాక్షాలా, అంగడి సరుకుగా మారిందన్నారు. గుత్త పెట్టుబడిదారీ సంస్థల అడుగులకు మడుగులొత్తుతూ విద్యను ప్రయివేటీకరిస్తున్నారని వాపోయారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక పేరుతో హడావిడి సృష్టిస్తూ సెలవులు లేకుండా చేసి ఇటు ఉపాధ్యాయులను, అటు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. యుటిఎఫ్ ప్రచురణల విభాగం రాష్ట్ర చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలనిచ్చిన కూటమి ప్రభుత్వం, ఉద్యోగుల అండదండలతో గద్దెనెక్కి ఇప్పుడు ఉద్యోగులను విస్మరించడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిల చెల్లింపులో మీనమేషాలు లెక్కిస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకొచ్చిన ఆరు మాసాల్లోగా బకాయిల చెల్లింపులకు చర్యలు చేపడతామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి పెద్దలు ఇప్పటివరకు కేవలం రూ.8500 కోట్ల మాత్రమే చెల్లించారన్నారు. మిగిలిన 30 వేల కోట్లు చెల్లింపులపై స్పష్టతే లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ప్రకటించుకునే పాలకులు ఉద్యోగుల విషయంలో మొండిగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జెవివి మాజీ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివ కుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.శ్రీనివాసులు, సి.వి.రమణ, కె.చెన్నయ్య, కె.మురళి కృష్ణ, బి.ప్రసన్న లక్ష్మి, ఎస్.ఎజాస్ అహమ్మద్, టి.శివ ప్రసాద్, ఈ.బాల జోజి, ఎ.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణా రెడ్డి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సి.సుదర్శన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

కలమల్ల శిలాశాసనానికి
ప్రపంచ ప్రాచుర్యం తీసుకువస్తాం

స్వర్ణ భారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీప వెంకట్

జానుమద్ది విగ్రహానికి నివాళులర్పిస్తున్న దీప వెంకట్

ప్రజాశక్తి కడప అర్బన్

కలమల్లలోని తొలి తెలుగు శిలాశాసనాన్ని ప్రపంచ ప్రాచుర్యం లోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని, భాషా, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించే బాధ్యత అందరిపై ఉందని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తనయ, స్వర్ణ భారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీప వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కేంద్ర గ్రంథాలయంలో జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో వెంకయ్య నాయుడు మానసపుత్రిక 'స్వర్ణభారత్ ట్రస్ట్' సౌజన్యంతో, కీ.శే. డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి 'బ్రౌన్ శాస్త్రి' శతజయంతి సంవత్సర సందర్భంగా ఏర్పాటు చేసిన తొలి 'తెలుగు శిలా శాసనం' నమూనా (రెప్లిక) స్థూపాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపా వెంకట్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. తన తండ్రి జిల్లా పర్యటన అనంతరం కలమల్ల తెలుగు శాసనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే అవకాశం కల్పించినందుకు గర్వంగా ఉందన్నారు. శిలాశాసన నమూనాను తమ ట్రస్టు ద్వారా సిపి బ్రౌన్ గ్రంథాలయంలో నెలకొల్పడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తెలుగు భాషను, సాహిత్యం పట్ల అవపోసనం చేసుకునే స్ఫూర్తిని ఇచ్చింది తన తండ్రి వెంకయ్య నాయుడే అన్నారు. రాజకీయ విధుల్లో భాగంగా అయిన వెంట నడిచిన ప్రయాణము, ఆయనకు అందించిన సహకరమే.. తన బాషా, సాహిత్య సేవ చేసే అవకాశము కలిగిందన్నారు. బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ సామాజిక సేవకు మారుపేరు అయిన దీపా వెంకట్ సామాజిక సేవలో ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందరన్నారు. నిరాడంబర సేవానిరతితో ముందడుగులేస్తున్న ఆమె ఆశయం స్వర్ణ భారతికి హారతులు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రంలో జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్టించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సమపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ విగ్రహాన్ని దీపా వెంకట్ పరిశీలించారు. అనంతరం సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించారు. గ్రంథాలయంలో నిక్షిప్తం చేసిన అమూల్యమైన, వెలకట్టలేని పురాతన తాళపత్ర గ్రంథ నిధిని, పరిశోధనా గ్రంథాలను, పలు రకాల గ్రంథాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, వంటేరు శ్రీనివాసులు, పలువురు ప్రముఖులు యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, భాష, సాహితీవేత్తలు, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు బయనపల్లె విద్యార్థులు

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు బయనపల్లె ఎస్.వి. హై స్కూల్ విద్యార్థులు ఎన్నిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీన్ దయాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జిల్లా సైన్స్ ఫెయిర్ ఎస్.వి హై స్కూల్ టీచర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు శివశంకర్, హరిబాబు రూపొందించిన 'స్మార్ట్ డ్రిప్ ఇరిగేషన్ సిస్టం' అనే ప్రాజెక్ట్ 'సస్టైనబుల్ అగ్రికల్చర్'అనే థీమ్‌లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సంపాదించారని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి చేతుల మీదుగా మెమోంటో, సర్టిఫికెట్లు అందుకున్నారని చెప్పారు. జిల్లా స్థాయిలో విద్యార్థులు రాణించడం పట్ల ఆ పాఠశాల కరస్పాండెంట్ చంద్రకాంతమ్మ, దీన్ దయాల్ శుభాకాంక్షలు తెలిపారు.

హామీలు విస్మరించడం బాధాకరం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న మేకల శివార్జున

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడం బాధాకరమని బహు జన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులను విస్మరించడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే పిఆర్‌సి కమిటీ వేసి 30 శాతం ఐఆర్ ను ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఎలు, ఐఆర్‌పిఆర్‌సి కమిటీ వంటి ఆర్థిక విషయాలపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక సంక్షేమాన్ని పట్టించుకోలేదని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఉద్యోగుల ఆర్థిక సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యోగులు కూడా ప్రజలలో భాగమేనన్న విషయాన్ని ప్రభుత్వం మరచిపోకూడదని అన్నారు. ఎప్పటికైనా పెండింగ్ డిఎలు, ఐఆర్ చెల్లించాల్సిందేనని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులలో నెలకొన్న తీవ్ర నిరాశ నిస్పృహలను తగ్గించాలని కోరారు. సమావేశంలో కడప జిల్లా అధ్యక్షులు యమ్. గంగరాజు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కట్టా గంగాధర్, జిల్లా కార్యదర్శి కె.జయరాం పాల్గొన్నారు.

కడపలో అంబేద్కర్ భవనం ప్రారంభించాలి

- కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు అన్వేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి రుణాలు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇవ్వాలని, రాజకీయ జోక్యం నివారించాలని, కడపలో అంబేద్కర్ భవన్ ప్రారంభించాలని కెవిపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు అన్వేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కెవిపిఎస్ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కడప నగర నాలుగో మహాసభ సిఐటియు జిల్లా కార్యాలయంలో సి.పి.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా గౌరవ అధ్యక్షులు అన్వేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి రుణాలను లబ్ధిదారులకు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వస్తున్నదని తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, చిన్న తరహా పరిశ్రమల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇంతవరకు రుణాలు మంజూరు చేయలేదని చెప్పారు. లబ్ధిదారులను ఎంపిక చేయడంలో రాజకీయ జోక్యం నివారించాలని డిమాండ్ చేశారు. నగరంలో అంబేద్కర్ భవనం లక్షల రూపాయలు కట్టి ఏడు సంవత్సరాలు అవుతుందని ఇంతవరకు ప్రారంభానికి నోచుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని అంబేద్కర్ భవన్ శిథిలావస్థకు చేరుకుందని, తక్షణమే మరమ్మతులు చేసి ప్రజా ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల సమస్యల పరిష్కార కోసం అన్ని దళిత సంఘాలను, ప్రజాసంఘాలను ఒక వేదిక పైకి తీసుకొచ్చి ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. కడప నగర కెవిపిఎస్ అధ్యక్షులుగా సి.పి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి నరసింహ తోపాటు 16 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

విజయవంతంగా స్కౌట్ మాస్టర్ శిక్షణ పూర్తి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వారం రోజుల నుంచి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రధాన శిక్షణా కేంద్రంలో జిల్లా చీఫ్ కమిషనర్ డాక్టర్ శంషుద్దీన్ ఆదేశాల మేరకు ఎల్‌ఓసి డాక్టర్ కమల కన్నన్, శివ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో బేసిక్, అడ్వాన్స్ కోర్సును నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల, కళాశాలల నుంచి దాదాపు 80 మంది పాల్గొన్నారు. ఎల్‌ఓసిల ఆధ్వర్యంలో వివిధ అంశాలు, స్టార్ గెజింగ్, ఫస్ట్ ఎయిడ్, మ్యాపింగ్, హైక్, పట్ల పలు విషయాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రతి ఒక్క అంశంపై పూర్తి స్థాయిలో చర్చించి ప్రతి ఒక్క పాఠశాలలో యూనిట్ ప్రారంభించడానికి సిద్ధమయ్యారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, కోశాధికారి శివ శంకర్‌రెడ్డి, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో వైద్య ఆరోగ్య శాఖలో ప్రమోషన్లు

- సీనియారిటీ జాబితాలో మృతుల పేర్లు తప్పనిసరి
- వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌డి బి.రామగిడ్డయ్య వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

జోన్-4 పరిధిలోని అర్హులైన స్టాఫ్‌నర్స్‌లు మొదలుకుని పిహెచ్‌ఎన్‌టి, పిహెచ్‌ఎన్‌ఎన్‌టి, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, జూనియర్ అసిస్టెంట్ల ప్రమోషన్లకు రంగం సిద్ధమైంది. దీంతో మెరు గైన వైద్యఆరోగ్య సేవలు అందించడానికి అవకాశం ఉంది. దీంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలతో ముందుకెళ్లే విధంగా నియామకాలు చేపడుతున్నాం. ఇటీవల నిర్వహించిన స్టాఫ్‌నర్స్‌ల బదిలీల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వలేదు. సీనియారిటీ జాబితాలో రిటైర్డు, మృతి చెందిన ఉద్యోగుల పేర్లను చూపించాల్సి ఉంది. ఇందులోభాగంగా వారి పేర్లను కూడా చూపించాం. రిక్రూట్‌మెంట్‌ల్లో దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను యూని వర్శిటీ ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం పారదర్శకంగా నియా మకాలు చేపడతామని పేర్కొంటున్న వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ బి.రామగిడ్డయ్యతో ముఖాముఖి...

ఇటీవలి స్టాఫ్‌నర్స్ ప్రమోషన్ల జాబితాలో రిటైర్డు ఉద్యోగుల పేర్లు ఉండటంపై మీ స్పందన ఏమిటి?

ప్రాంతీయ వైద్యఆరోగ్యశాఖలో సీనియారిటీ కలిగిన ఉద్యోగుల జాబితాలో రిటైర్డు, మృతుల పేర్లు ఉంటాయి. కేడర్ ఆధారంగా సీని యర్ల పేర్లు ఉంటాయి. ఇటీవల రిక్రూట్‌మెంట్‌లో దాదాపు 90 మంది పిహెచ్‌ఎన్‌టి పోస్టుల భర్తీకిగానూ 84 మంది జాయిన్ అయ్యారు. నాట్ విల్లింగ్ సుమారు 10 మంది వరకు ఉన్నారు. వచ్చేవారం అటువంటి స్థానాలను భర్తీ చేస్తాం.

ప్యానల్ ఇయర్‌లో ఉద్యోగుల ప్రమోషన్లు ఎప్పుడు?

త్వరలో ఆయా కేటగిరీలోని అర్హత కలిగిన ఉద్యోగులకు ప్రమోషన్లు లభించే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే సీనియారిటీ ప్రాతిపదికన పిహెచ్‌ఎన్‌టి, పిహెచ్‌ఎన్‌ఎన్‌టి, రేడియోగ్రాఫర్స్, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రమోషన్లు కల్పించాం. ఆనతికాలంలోనే హెడ్‌నర్స్, హెల్త్ ఎడ్యుకేటర్ నుంచి డిప్యూటీ డెమో స్థాయి కేటగిరీలోని ఉద్యోగులకు ప్రమోషన్లు లభించే అవకాశం ఉంది.

కాంట్రాక్టు ఉద్యోగులకు బదిలీ వార్తలపై మీరేమంటారు?

రాష్ట్రప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాల్సి ఉంది. జోన్-4 పరిధిలోని స్టాఫ్‌నర్స్, ఇతర ఉద్యోగులకు బదిలీలు తప్పవనే వార్తలు వినిపిస్తున్న మాట వాస్తవమే. కాంట్రాక్టు బదిలీలపై స్పష్టత వచ్చిన వెంటనే తెలియజేస్తాం.

జోన్-4లోని ఉద్యోగుల వివరాలు తెలపండి?

జోన్-4 పరిధిలో కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో 3, 833 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ఎంపిహెచ్‌ఇఒ, ఎంపిహెచ్‌ఎస్, హెచ్‌ఇసి, ఎంఎల్‌హెచ్‌పి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, తాజాగా ఫార్మసిస్టులను కూడా కలపడంతో విస్తృతి పెరిగింది. వీరందరి సర్వీసులు, రిక్రూట్‌మెంట్లు, బదిలీలు, వైద్య ఆరోగ్యానికి సంబంధిత స్కీముల అమలు తీరును పరిశీలన చేయాల్సి ఉంటుంది.

నకిలీ సర్టిఫికెట్ల నివారణ చర్యలేమిటి?

జోన్-4లో నర్సింగ్ నియామకాల్లో నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణపై సీరియస్‌గా దృష్టి సారించాం. దరఖాస్తుల స్క్రీనింగ్ అనంతరం నిర్వహించనున్న కౌన్సిలింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థి సర్టి ఫికెట్లను ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ ఉన్నతాధికారుల సహకారం తీసుకున్నాం. ఇందులో 26 మంది నకిలీ దరఖాస్తుదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడమైంది. సంబంధిత యూనివర్శిటీ అధికారులు సర్టిపై చేసిన అనంతరం నియామకాలు చేపడతాం.

దీర్ఘకాలిక రోగుల వైద్యసేవలను వివరించండి?

క్రానిక్ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవ కాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి జీవితాల్ని అతి కష్టంగా లాగుకొస్తున్న వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవడంలో భాగ ంగా నియామకాలు చేపడతాం. ప్రతి పిహెచ్‌సి పరిధిలో 172 రకా ల మందులను అందుబాటులో ఉంచుతాం. గుండె సంబంధిత వ్యా ధుల మందులను సైతం అవసరమైన మేరకు అందుబాటులో ఉంచే ప్రయత్నం జరుగుతోంది.

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కడప

కడపలో ఉన్న ఆస్ట్రోటర్ఫ్ హాకీ కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించాలని జిల్లా సీనియర్ హాకీ క్రీడాకారుడు, ధ్యాన్ చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ సుభాన్‌బాషా కోరారు. కడపలో హాకీఆస్ట్రోటర్ఫ్ మైదనాన్ని మాట ప్రకారం అందించినందుకు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి సుభాన్ భాష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం కడప నగరంలోని గుంత బజార్‌లోని తన కార్యాలయంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్లు, ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారికి బట్టలు అందించారు. అనంతరం క్రీడాకారులకు హాకీ స్టిక్స్ అందించారు. మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

మున్సిపల్ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న సుబాన్‌బాషా

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం దువ్వూరులో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి ఆదివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భూమి పూజ చేశారు. చాలా ఏళ్ల నుంచి ప్రయాణికులు ఎదురుచూస్తున్న బస్ షెల్టర్‌ను గతంలో ఏర్పాటు చేసి ఎంతో మేలు చేశారు. ఇందులో భాగంగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణంతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలకు చాలా ఇబ్బందులు తొలగనున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతకుంట పంచాయతీ అరుంధతి నగర్‌లో శ్మశాన వాటికకు భూమిపూజ చేశారు. మండల టిడిపి అధ్యక్షులు బొర్రెడ్డి రమణారెడ్డి, మండల ఇన్‌ఛార్జి పాపినేని రాంబాబు, అందే శ్రీనివాసులు, పొలిమేర రవీంద్రారెడ్డి, డిసిసి చైర్మన్ మోహన్‌రెడ్డి, శెట్టి నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యమాలతో ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను కాపాడుకునే తరుణం ఆసన్నమైందని, ఉద్యమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్టీయు కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, నిర్ణయాలు ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని బలహీన పరుస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శించారు. నూతన విద్యా విధానం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విపరీతమైన బోధనేతర కార్యక్రమాలను పాఠశాల విద్యలో అమలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, రీజియన్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డిసి గోవిందు, భాస్కర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

నేడు వేములకు ఆర్‌డిఒ చిన్నయ్య రాక

ప్రజాశక్తి - వేముల

వేముల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య పాల్గొననున్నట్లు తహశీల్దార్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఒ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కారక వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నియామక పత్రాన్ని అందకుంటున్న మల్లికార్జున

ఎరుకల అభివృద్ధికి కృషి చేస్తా

ఎరుకల సంఘం మండలశాఖ అధ్యక్షుడు నల్లగొండ్ల మల్లికార్జున

ప్రజాశక్తి - చాపాడు

ఎరుకల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి చాపాడు మండలశాఖ అధ్యక్షుడు నల్లగొండ్ల మల్లికార్జున తెలిపారు. సమితి మండలశాఖ అధ్యక్షుడిగా తనను నియమించారని తెలిపారు. కడప ఎర్రముక్కపల్లె సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏపీ రాష్ట్ర కన్వీనర్ ద్రాక్షం శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు మల్లిఖార్జున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెనుగొండ పుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తొటుకు రామాంజనేయులు పాల్గొన్నారు.

టీజర్ విడుదలలో నవాబుపేట యూత్, నిర్మాత, డైరెక్టర్

నవాబుపేట గ్రామదేవర డాక్యుమెంటరీ ప్రదర్శన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

నవాబుపేట గ్రామదేవర పెద్దమ్మ-చిన్నమ్మ కథనంగా రూపొందిన డాక్యుమెంటరీ హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ లేబరేటరీలో ఆదివారం ప్రదర్శించారు. డాక్యుమెంటరీ గురించి క్రియేటివ్ హెడ్ వెన్నపూస శివప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ మురళికృష్ణ తుమ్మ, నవాబ్‌పేట గ్రామ సంప్రదాయాలు, విశ్వాసాలను ఆవిష్కరించే ఈ డాక్యుమెంటరీని చాలా అద్భుతంగా తీశామన్నారు. లిరిక్స్, గ్రాఫిక్స్ చాలా బాగా చేశామన్నారు. మ్యూజిక్ ఆకట్టు కుంటుందన్నారు. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ఈ ప్రయత్నం ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. డాక్యుమెంటరీ త్వరలోనే జమ్మలమడుగులో విడుదల చేస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏంజెల్ సోమశేఖర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, నియామకాలు, పదోన్నతులపై చర్చించారు. తాత్కాలిక ప్రాతిపదికన గత 15 ఏళ్ల నుంచి పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్‌లకు ఇదివరకే అమలు చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 114ను అమలు చేస్తూ తక్షణమే వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు గరుడాచలం, జనరల్ సెక్రెటరీ సాయికుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నాగేంద్రరెడ్డి, వెంకటసుబ్బయ్య, దివాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరం

మైదుకూరు బస్టాండ్‌లో పోలియో చుక్కల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న

ప్రజాశక్తి - వేంపల్లె

అయిదేళ్లలోపు పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైఎస్ మదీనాపురంలో ఇన్‌ఛార్జి ఇస్మాయిల్, ఆర్టీసీ బస్టాండ్‌లో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, తెలంగాణ వలి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు** :పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం మండల వైద్యాధికారి శివ ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మండల పరిధిలో 45 కేంద్రాలలో 5 రూట్లలో పల్స్ పోలియో కార్యక్రమం సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించామన్నారు. చాపాడు పరిధిలో 0–5 ఏళ్ల పిల్లల సంఖ్య 4,598 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, నక్కలదిన్నె వైద్యాధికారి, రూట్ సూపర్వైజర్స్ ఎం.రాఘవయ్య, భాస్కర్, టి.ప్రసాద్, ఆర్.భవాని, పోలియో కేంద్రాల సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు. **మైదుకూరులో..** మైదుకూరు పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఎపి రవీంద్ర, డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వి.మల్లేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ సుమధుర, ఎస్ అయేషా, హెల్త్ సూపెర్వైజర్స్ కె.వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్స్, రమేష్, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రాన్ని స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న తనిఖీ చేశారు. కార్యక్రమంలో కడప ఎంపిహెచ్ఈఓ ఎంవివి ప్రసాద్ , సిబ్బంది పాల్గొన్నారు. **వేముల :** అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి పేర్కొన్నారు. వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఆయన చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ శరణ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పులివెందుల నగరిగుట్టలోని శ్రీనివాస అభ్యుదయ పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎఎన్ఎంలు చిలకమ్మ, సునీత, ఆశా కార్యకర్తలు రమీజా, రమణమ్మ, అంగన్వాడీ కార్యకర్త మరియమ్మ పాల్గొన్నారు. **ముద్దనూరు :** మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండల వ్యాప్తంగా 41 బూత్‌లు నాలుగు రూట్ల ద్వారా 3,219 మంది చిన్నారులకుగాను 2,981 మందికి 92 శాతం పోలియో చుక్కలు వేసినట్లు పిహెచ్‌సి వైద్యాధికారులు కరిష్మా, శ్రీకాంత్ తెలిపారు. సిహెచ్ఒ ప్రసాద్ యాదవ్, సూపర్‌వైజర్ రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ జాన్సన్, ఫార్మజిస్టు జగదీష్, జయాకర్, సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు

వల్లంబాయికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జమ్మలమడుగులో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి హృషికేశవ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిచే కేక్ కట్ చేయించారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీఈసీ మెంబర్ గిరిధర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆదివారం పులి వెందుల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ ఆడిటోరియం ప్రాంగణంలో కడప ఎంపీ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. 23వ వార్డు కౌన్సిలర్ వెంకటరమణ ఏర్పాటు చేసిన 53కిలోల కేక్‌ను కట్ చేసి వైసీపీ నాయ కులకు తిని పించారు. అనంతరం వైసీపీ నాయ కులు, కార్యక ర్తలు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. పలు ప్రాం తాలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వ హించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్ మనో హర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వంప్రసాద్, మార్కె ట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, నియో జకవర్గంలోని వైసీపీ నాయకులు, వైసిపి కౌన్సి లర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేంపల్లె : మండల వ్యాప్తంగా వైసీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, మాజీ ఇన్‌ఛార్జి సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మునీర్ కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. పంచాయతీ కార్యాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలిరెడ్డిపల్లె, తాళ్లపల్లె, పాములూరు, వేంపల్లి వీరన్న గట్టుపల్లె, ఇడుపులపాయి, వేంపల్లెలోని గాంధీ రోడ్డులో ఉన్న గ్రామ కమిటీ ఆఫీసులో శంకరయ్య, రామకృష్ణారెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, గంగాధర్ ఆధ్వర్యంలో, పాత బ్యాంకు వీధిలో బండల షుకూర్, బాబా షరీఫ్, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

తొండూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డివి శశికాంత్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేలండర్లను ఆవిష్కరించారు. డివి శశికాంత్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరు : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం వైసిపి మండలశాఖ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, శ్రేణులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయం, కోడిగాండ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న యేసు కరుణాలయం అనాథ ఆశ్రమంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. అనాథలకు బ్రెడ్లు, పండ్లు పంపణీ చేసి, అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.మఠం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బ్రహ్మంగారిమఠంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వైసిపి మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందరెడ్డి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. దుప్పట్లు పంపిణీ చేశారు. వైసిపి జిల్లా యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ మనోహర్ ఆచారి, వీరపు ఉమాపతి, ముక్కమల్ల భాస్కర్ రెడ్డి, తిప్పన నాగార్జున నాయుడు, మాజీ ఎంపీటీసీ పసుపులేటి రామయ్య, మన్యం శంకర్ రెడ్డి, సోమిరెడ్డిపల్లె గురుమూర్తి, వైసీపీ మైదుకూరు స్టూడెంట్ విభాగ అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, బండి సుబ్బరాజా నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు.

మాట్లాడుతున్న నల్లేరు విశ్వనాథరెడ్డి

కాసినాయన : మడిమ తిప్పని మాట తప్పని వైఎస్ కుటుంబం వెంటే కొనసాగుతానని, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి హామీల మేరకే పార్టీ అభివృద్ధి చేస్తున్నానని వైసిపి బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు ఆదివారం పోరుమామిళ్ల పట్టణంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆయన స్వగృహం నుండి ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వరకు వేలాది మంది కార్యకర్తలతో బాణాసంచా పేలుస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ఆయనే రక్తదానం చేశారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడం లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేల మంది కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

వల్లూరు : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎపిఎస్ఆర్‌టిసి మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. జగన్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. మండల నాయకులు గుర్రంపాటి వెంకట సుబ్బారెడ్డి, గోటూరు ఎంపిటిసి సోమల రామ కృష్ణారెడ్డి, గుర్రంపాటి విశ్వనాథరెడ్డి, గుండ్లూరు నాగ సుబ్బారెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మాజీ సిఎం వైఎస్ జగన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పట్టణంలో రైల్వే గేటు వద్ద ఉన్న అనాథ ఆశ్రమంలో నిరాశ్రయులకు, తిప్పలూరు గ్రామంలోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథ ఆశ్రమంలో వైసిపి నాయకులు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో, ముద్దనూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, జెడ్పిటిసి బాలయ్య, ఉప మండల అధ్యక్షులు మల్లు మోహన్‌రెడ్డి, పొన్నా శీను, పట్టణ అధ్యక్షుడు జయ రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, వజ్ర డేవిడ్, రామకృష్ణారెడ్డి, తుంగ వెంకటరామిరెడ్డి, అలీ, ప్రశాంత్, కౌన్సిలర్ ఎరుకలరెడ్డి పాల్గొన్నారు. పోట్లదుర్తి గ్రామంలో వైసిపి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వేముల : పులివెందులోని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాసంలో మాజీ సీఎం వైఎస్ జగన్మో

జగనన్న పాటను విడుదల చేస్తున్న ఎంపీ, వైసిపి నాయకులు

హన్‌రెడ్డి జన్మదినోత్సవ సందర్భంగా వైసిపి వేముల మండలశాఖ అధ్యక్షుడు నాగేళ్ల సాంబ శివారెడ్డి, కోకటం వెంకటబయపు రెడ్డి, మాజీ పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, గూడూరు చిన్నప్ప, హాల్ గంగాధర్‌రెడ్డి, పార్టీ నాయకుల ఆధ్వర్యంలోఎంపీ జగన్‌రెడ్డి పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా చేయాలన్నదే మన ధ్యేయమన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పార్టీ కోసం పనిచేయాలన్నారు. అలాంటి వారి కి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చాపాడు : మండల కేంద్రంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఉప ఎంపిపి ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీవీ సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, రాజేంద్రనాథ్ రెడ్డి, శివప్రసాద్, రమణయ్య, జమాల్ వల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైదుకూరులో.. మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, భరత్, పట్టణ అధ్యక్షుడు లింగన్న, నాయకులు శివప్రసాద్ రెడ్డి, నాగేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

దువ్వూరు : వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో వైఎస్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జగన్ పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగం రెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి కేక్ కట్ చేసి, కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొంతపల్లి వెంకట సుబ్బారెడ్డి, వివి స్వామి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాల : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బాబురెడ్డి, యూత్ కన్వీనర్ మనోహరరెడ్డి, వెలిదండ్ల మల్లికేశవరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి 53వ జన్మదిన వేడు కలను పురస్కరించుకొని కడప రాయచోటి రింగ్ రోడ్డు వైఎస్ఆర్ సర్కిల్‌లో కమ లాపురం వైసిపి యువజన విభాగం అధ్యక్షులు గజ్జల ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ కేక్ కటింగ్ కార్యక్రమానికి కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో నాయ కులు గూడా సదానంద రెడ్డి, ఓబుల్ రెడ్డి, జయరామిరెడ్డి, నీలకంఠ రెడ్డి, కృష్ణయ్య, వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు

నేడు చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభ

జమ్మలమడుగు : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభ జమ్మలమడుగులో సోమవారం నిర్వహిస్తున్నామని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరణాల శివనారాయణ తెలిపారు. స్థానిక ముద్దనూరు రోడ్డు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నుంచి తాడిపత్రి రోడ్డు నాగులకట్ట శివ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఆమేరకు ఆదివారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘం నాయకులు సంజీవ రాయుడు, లక్ష్మీ నారా యణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివనారాయణ

సర్టిఫికెట్లు పోయినవి

షేక్ షబ్బీర్ భాష గారి కుమారుడు షేక్ సలీం ఎర్రగుంట్ల పట్టణంలో పోలీస్ స్టేషన్ వెనకాల వీధిలో 4/109-b-2 డోర్ నెంబర్ గల ఇంటిలో నివాసం ఉంటున్నాడు. పనిమీద 19.12.2025 తేదీ ప్రొద్దుటూరుకు వెళ్లడం జరిగింది. అదే రోజు సాయంత్రం 7 గంటల సమయంలో ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్లకు ఆర్టీసీ బస్సు నెంబరు **AP36Z0053** వస్తున్న క్రమంలో సర్టిఫికెట్లు పోయినవి. బీటెక్‌కు సంబంధించిన సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ నంబరు191714046. **B.tech 8th sem certificate, Provisional certificate, TC** పోవడం జరిగింది. ఎవరికైనా దొరికిన యెడల తనకు ఇవ్వాలని, **9515634557** ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని కోరుతున్నాను.

CHANGE OF NAME

I, **SHAIK JAMRUD BASHA** (Old Name) S/o **Shaik Abdulla Sharieef**, resident of D.No. 2/1043-1, Sri Harirao Street, Nagarajupet, Kadapa city, YSR Kadapa Dist, Andhra Pradesh. I changed my name to **MAKKAPALAEM JAMRUD SHAREEF**. Henceforth, I will be known as **MAKKAPALAEM JAMRUD SHAREEF.**

మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అభివృద్ధి ఎవరు చేశారో ప్రజలకు తెలుసు : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో ప్రజలకు తెలుసునని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటల బీమా గడువు పెంచాలన్నారు. పూర్తయిన పనులకు రంగులు వేసి ప్రారంభించడం చంద్రబాబుకు మా మూలేనని విమర్శించారు. పులివెందులలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.450 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులను ప్రారంభించి, 50 శాతం వరకు పనులు పూర్తి చేశారన్నారు. మళ్లీ శంకుస్థాపన చేయాలని చంద్రబాబు చూస్తున్నారని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ నుంచి అన్నింటిలో క్రెడిట్ చోరీ కార్యక్ర మం పెట్టుకున్నారన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పూర్తి చేసిన చిత్రా వతి, పైడిపాలెం రిజర్వాయర్లకు రంగులేసి ప్రారంభించారని పేర్కొన్నారు. వీళ్ల ఎన్ని కాకమ్మ కబుర్లు చెప్పినా ప్రజలకు అన్నీ తెలుసునని సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉచిత పంటల బీమా ఒక హక్కుగా వచ్చేదన్నారు. పంట బీమా గడువు జనవరి 15 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకు వచ్చి బీమాపై స్పష్టత ఇవ్వాలన్నారు. చంద్రబాబు అమరావతి, 0.99పైసలకే భూముల పందేరంలో , తండ్రీ కొడుకులిద్దరూ పబ్లిసిటీలో యాక్టివిటీగా ఉన్నారన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

ఎన్నికల్లో కూటమి నాయకులు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వీరణాల శివ కుమార్, ముడియం చిన్న డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇంత వరకు అమలు చేయలేదని ఆదివారం వారు మైదుకూరులో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఇంత వరకు హామీల అమలు చేయలేదన్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో రూ.వేలు చెల్లిస్తున్నారని, ఇది తల్లిదండ్రులకు భారమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల్లో అన్ని అమలు చేశామని చెబుతున్నా, నిరుద్యోగభృతి సంగతి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీ అమలు చేయాలని, లేకుంటే నిరుద్యోగుల పక్షాన భవిష్యత్‌లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, ఉపాధ్యక్షులు గండి సునీల్ పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఖేలో ఇండియా అస్మిత లీగ్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాస్థాయి ఖేలో ఇండియా అస్మిత లీగ్ పోటీలు విజయవంతం అయ్యాయి. ఆదివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్–14,16 బాలికలకు పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు అందించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మార్తల సుధాకర్‌రెడ్డి, జిల్లా సంఘం అధ్యక్షులు బసిరెడ్డి వీర కళ్యాణ్ రెడ్డి మాట్లాడారు. ఈ క్రీడలకు గుంటూరు జిల్లాకు చెందిన కే రాజా లెవెల్ 1 కోచ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్‌గా వ్యవహరించారు. నిర్వహణలో వ్యాయామ సంచాలకులు నాగూర్ బాషా, రమణయ్య, షేక్ బాబు, సుబ్బయ్య, లక్ష్మీ, రాఘవ, సతీష్‌రెడ్డి, సంజీవ్, బాషా, ఖాదర్, రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు రఫీ సహకరించారు. వీరందరికీ అధ్యక్షులు బసిరెడ్డి వీర కళ్యాణ్‌రెడ్డి, కార్యదర్శి అమర్ బాషా ధన్యవాదాలు తెలిపారు.

మైనార్టీ నేత హకీం గుండెపోటుతో మృతి

వేంపల్లె : వైసిపి మైనార్టీ నేత, పాతహాల్ ఓనర్ చింతకాయల హకీం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక పాత పోస్టాఫీసు వీధిలో నివాసం ఉంటున్న హకీంకు ఆదివారం శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ప్రయివేటు ఆసుపత్రికి తరలించేలోపు గుండె పోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన మృతికి పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హకీం మృతదేహాన్ని పలువురు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వైసీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, షేక్షావలి, మునీరు, పద్మా రాజ్‌కుమార్, రామచంద్రారెడ్డి, శేషు, ఆయా పార్టీల రాజకీయ నాయకులు, జర్నలిస్టులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE CUM MACT AT BALLARI

M.V.C. NO. 14/2025

Between:
Smt. K. Durgamma @ Kavali Durga. ...Petitioner

AND

S.Nazeer Ahammad and others. ..Respondents

SUMMONS TO THE RESPONDENT NO. 1 AND 2

To,
R-1 Nazeer Ahammad S/o Sayyad Ahammad Ghouse, aged about 58 years, Driver of the Lorry bearing Reg. No. AP-6/TH-1969, R/o.D.No.11/133-2, Matsya Colony, Proddaturu village, YSR Kadapa District 515360. AP. State
R-2: Syed Javeed Iqbal S/o.Syed Maqbul Basha, aged about 40 years, owner of the said Lorry, R/o.22-600, Asar Sharif Street, Proddutur village, YSR Kadapa District 516360. AP. State

Whereas the above named petitioner has filed the above suit against you seeking compensation for the injuries sustained by the petitioner in the motor vehicle accident. Therefore, you are hereby, directed to appear in this Court in day of person or by a Pleader duly instructed on **31.01.2026 at 11.00 A.M** before this Court to answer the claim in your defence and also, to produce on the said day all the document in your possession and to file the written statement within 30 days, failing which the suit will be heard and determined exparte.

Given under my hand and seal of the Court on this 17th day of December 2025.

BY ORDER OF THE COURT

Advocate for the Petitioner.

Sheristedar
II ADDITIONAL DISTRICT AND SESSIONS CUM MACT AT BALLARI